

నిధుల గోల్‌మాల్‌పై చర్యలేవి?
- జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో రూ.7కోట్లు దుర్వినియోగం
- ఏడాది అవుతున్నా ఎటూ తేలని వ్యవహారం
- తాజాగా సూపరింటెండెంట్ ఫిర్యాదుతో పోలీసుల ఆరా

7

మెడికల్ కాలేజీపై ఎన్‌ఎంసీ అసంతృప్తి



పూర్తికాని మెడికల్ కళాశాల భవన నిర్మాణం



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న జగిత్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల



- జగిత్యాలలో తాత్కాలిక భవనంలో నిర్వహణ
- అద్దె భవనాల్లో హాస్టళ్లు
- వసతులు లేమితో విద్యార్థుల ఇక్కట్లు

జగిత్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణపై జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బృందం అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల విస్తరణలో భాగంగా 2020లో జగిత్యాలలో మెడికల్ కాలేజీకి జాతీయ వైద్య కమిషన్ అనుమతులు మంజూరు చేసింది. అదే ఏడాది ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 150 సీట్లు కేటాయించారు. జగిత్యాల పట్టణంలోని ఎస్ఆర్ఎస్పీ క్యాంపులో అగ్రోస్ గోదాముల్లో మెడికల్ కాలేజీకోసం 27ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ప్రిన్సిపాల్, స్టాఫ్ గదులు, తరగతి గదులతో 2022 మార్చిలో కాలేజీని ప్రారంభించారు. ప్రస్తుతం మూడో సంవత్సరం బ్యాచ్ కొనసాగుతోంది. కాలేజీకి అనుబంధంగా జిల్లా ఆస్పత్రిని 350 పడకలతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిగా, మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని 150 పడకలతో అనుబంధంగా కొనసాగిస్తున్నారు.

● ఎన్ఎంసీ తనిఖీల్లో లోపాలు బహిర్గతం

2023లో ఎంబీబీఎస్ అడ్మిషన్లకు ముందు ఎన్ఎంసీ నిర్వహించిన తనిఖీల్లో కాలేజీ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. రేకుల గోదాముల్లో కాలేజీ నిర్వహణ, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సరైన వార్డులు, ల్యాబ్‌లు, మౌలిక వసతుల లేమిపై ఎన్ఎంసీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవలి తనిఖీల్లోనూ ఇవే లోపాలను గుర్తించారు. దీంతో ఈ విద్యా సంవత్సరం ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుపై అనిశ్చితి నెలకొంది. ఇటీవల ఢిల్లీలో జరిగే విచారణకు ఆరోగ్య శాఖ కార్యదర్శి, వైద్య విద్య సంచాలకులు యూజీ ఎంఈబీ డైరెక్టర్ హాజరు కావాలని ఎన్ఎంసీ ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో కొత్తగా ఏర్పడిన 27 కళాశాలల్లో ఎన్ఎంసీకి అనుగుణంగా వసతులు లేవని తేలింది. ఇందులో జగిత్యాల వైద్య కళాశాల సైతం ఉంది.

● నిర్మాణ పనుల్లో జాప్యం..

ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఆర్ఎస్పీ క్యాంపులో మెడికల్‌కళాశాల భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. మెడికల్ కళాశాల భవనాల పనులకు గత ప్రభుత్వం రూ.132 కోట్లు నిధులు మంజూరు చేసింది. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహం, పర్యవేక్షకుల గదులు, అంతర్గత రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులకు ఆయా నిధులు వెచ్చించాల్సి ఉంది. మూడు దశల్లో పనులు పూర్తి చేయడానికి నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి దశగా రూ.14 కోట్లు వెచ్చించి కళా శాల తరగతుల నిర్వహణ, తాత్కాలిక భవనాల ఏర్పా టు, ఇతర భవనాల అభివృద్ధి తదితర పనులను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన బిల్లులు కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం చెల్లింపు జరిపింది. రెండో దశలో ...

మిగతా 8లో

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

-కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



జాబ్‌మేళా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల,జూన్ 19(ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గ నిరుద్యోగ యువత ఈనెల 28న పట్టణంలో నిర్వహించే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సూచించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంబంధిత జాబ్ మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే జాబ్ మేళాకు పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారు అర్హులేనని అన్నారు. యువత క్యూఆర్ కోడ్ ద్వారా ఎన్‌రోల్ చేసుకోవాలన్నారు. వివరాలకు 7893636313, 9948335533 నంబర్లలో సంప్రదించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఎనిమిది మంది ఎస్సైల బదిలీ

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాలతో పాటు నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో పనిచేస్తున్న ఎనిమిది మంది ఎస్సైలను బాసర-2 జోన్ డిప్యూటీ ఐజీ ఆదేశాల మేరకు బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల టౌన్-2 ఎస్సైగా పనిచేస్తున్న గీతను సారంగాపూర్‌కు, ధర్మపురి ఎస్సై ఉదయ్‌కుమార్‌ను వెల్గటూర్‌కు, కోరుట్ల ఎస్సై శ్రీకాంత్‌ను జగిత్యాల డీఎస్‌బీకి బదిలీ చేశారు. సారంగాపూర్ ఎస్సై దత్తాద్రిని డీసీఆర్‌బీకి, గొల్లపల్లి ఎస్సై సతీష్‌ను డీఎస్‌బీకి బదిలీ చేశారు. వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్‌ను జగిత్యాల వీఆర్‌కు, నందిపేట ఎస్సై చిరంజీవిని కోరుట్ల-1 ఎస్సైగా, నిర్మల్ జిల్లా కడెం ఎస్సై క్రిష్ణసాగర్‌రెడ్డిని గొల్లపల్లి ఎస్సైగా బదిలీ చేశారు.

'నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి'

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము సూచించారు. నిరక్షరాస్యుల వివరాలను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని ఆయన అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీఇబి భవన్‌లో ఉల్లాస్ యాప్ వినియోగం, విధివిధానాలపై జిల్లాలోని సెర్ప్, మెప్మా సిబ్బందికి సాక్షర భారత్ జిల్లా నోడల్ అధికారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రాము మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 40,542మంది నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని, వారిని ఎస్సెస్సీ ఇంటర్మీడియేట్ తదితర పరీక్షల్లో ఉత్తీర్ణత పొందేలా సెర్ప్, మెప్మా సిబ్బంది కృషి చేయాలన్నారు. మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో మెప్మా ఆర్పీలతో సర్వే చేయిస్తామన్నారు. కార్యక్రమంలో నిర్వహణ అధికారి ప్రతాప్‌రావు, ఏపీవో శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ మహేష్, సెర్ప్ డీపీఎం మల్లేష్, మెప్మా డీఎంసీ సునీత, సెర్ప్ ఏపీఎంలు, సీసీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెప్మా టీఎంసీలు, సీవోలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రాము

విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలి

విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాము అన్నారు. పట్టణంలోని పురాతన ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అటల్ టింకరింగ్ మేకథాన్ బూట్ క్యాంప్ మూడు రోజుల శిక్షణ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి ఆయోగ్ పర్యవేక్షణలో విజ్ఞాన్ ఆశ్రమ్ యూనిసెఫ్ సహకారంతో నడుస్తున్న అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా ఈ మేకథాన్ బూట్ క్యాంప్ విద్యార్థులకు చాలా ఉపయోగ పడుతుందన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మచ్చరాజశేఖర్, సమగ్రశిక్ష కో ఆర్డినేటర్ కొక్కుల రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, శిక్షకులు గణేష్, పవన్ పాల్గొన్నారు.

● ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు యోగా వేడుకలను నిర్వహించాలని డీఈవో రాము సూచించారు. యోగా లింక్‌లో ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. యోగా దినోత్సవం రోజున ప్రతి పాఠశాలలో ఉదయం 6.30గంటల నుంచి 7.45 వరకు ఆసనాలు వేయించాలన్నారు. పిల్లలందరికీ యోగా పట్ల, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని, ఆరోగ్య భారత్ నిర్మించాలని డీఈవో రాము కోరారు. నాణ్యమైన ఫోటోలు వాట్సాప్ గ్రూప్‌తో పాటు ఇచ్చిన లింకులో అప్‌లోడ్ చేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతం



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొడిమ్యాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని చెప్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అంగన్‌వాడీ టీచర్లు సీమంతం చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ సుధారాణి మాట్లాడుతూ చిన్నారులను ప్రైవేటు స్కూల్‌కు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు. అంతక ముందు 18సంవత్సరాలు లోపు పిల్లలకు పెళ్ళిల్లు చేస్తె వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ మండల కోఆర్డీనేటర్ లహరి అన్నారు. బాల్య వివాహాలు చేయటం వలన కలుగు నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో డాక్టర్ హారిక, అంగన్‌వాడీ టీచర్లు ఉమ, జ్యోతి, సుజాత, అంజలి కల్పన, తల్లులు, అంగన్‌వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మెరుగు అశోక్ మాతృ మూర్తి మృతి చెందగా గురువారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి నివాళి అర్పించారు. కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచంద్రం గౌడ్, రంగు తిరుపతి, మూగల సత్యం, గుండ జగదీశ్వర్, పెద్దూరి భరత్, బందెల రాజేష్ పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్చకుల సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వీర శైవ అర్చక సమాఖ్య తెలంగాణ అధ్యక్షులు గుంటి జగదీశ్వర్ గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, రాష్ట్ర ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి ఉమామహేశ్వర్‌లు ముఖ్యమంత్రి సలహాదారును కలిసిన వారిలో ఉన్నారు.

దివ్యాంగుల ఉపకరణాల దరఖాస్తు గడువు పొడిగింపు

జగిత్యాల అగ్రికల్చర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగ సోదరులకు సహాయ ఉపకరణములు అందించేందుకు దరఖాస్తుకు గడువును పొడిగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి డాక్టర్ భోనగిరి నరేష్ తెలిపారు. గతంలో ఈ నెల 18వ తేది తుది గడువుగా పేర్కొన్నప్పటికీ ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 27 వరకు దరఖాస్తుకు గడువు పెంచినట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని మరిన్ని వివరాలకు దివ్యాంగుల హెల్ప్‌లైన్ 155326 నంబర్‌లో సంప్రదించాలని నరేష్ ఒక ప్రకటనలో కోరారు.

చెరువు కాలువ కోసం సర్వే



తక్కళ్ళపల్లిలో సర్వే చేస్తున్న ఇరిగేషన్ అధికారులు

కథలాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తక్కళ్ళపల్లిలో పాడి చెరువును నింపడానికి కాలువ నిర్మించడానికి గురువారం ఇరిగేషన్ అధికారులు సర్వే ప్రారంభించారు. ఉదకమ్మ చెరువు నుంచి పాడి చెరువు మత్తడి నుంచి వృథాగా పోతున్న నీటితో పాడి చెరువును నింపాలని వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్‌ను రైతులు కోరగా ఇరిగేషన్ అధికారులను సర్వే కోసం ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు సర్వేలు ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం అధ్యక్షుడు అల్లకొండ లింగంగౌడ్, కోట లక్ష్మీనర్సయ్య, మొలిగె సుదర్శన్, రైతులు ఉన్నారు.

'స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు'

మెట్‌పల్లిటౌన్,జూన్ 19(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లిని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కార్యలయాలు, ప్రభుత్వ పాఠశాలల గోడలపై వాల్ పెయింటింగ్‌కు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ వాసులకు స్వచ్ఛత, పచ్చదనం, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, తడి చెత్త, పొడి చెత్త వంటి అంశాలపై అవగాహన కల్పించేలా వాల్ పెయింటింగ్స్ వేయిస్తున్నాన్నారు. ప్రతీ పని పట్టణం పురోగతికి దోహద పడుతుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, ఏఈ తిరుపతి,దిలీప్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, టీఎంసీ సోమిడీ శివ,ముజీబ్,ఎండి నిజాం, అశోక్, నరేష్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మోతెవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎనిదవ వార్డులోని బుడిగె జంగాల కాలనీలో జ్వర సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మురికి కాలువల వద్ద, నీరునిలిచి ఉన్న ప్రదేశాలలో దోమలు అభివృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని, ఇండ్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


● కథలాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో వివిధ ఆంశాలపై సమీక్ష నిర్వహించారు. రికార్డులు పరిశీలించి సక్రమంగా రికార్డులను నిర్వహించాలని సూచించారు. ఇమ్యునైజేషన్, ఎన్‌సీడీ ప్రోగ్రాం, క్యాన్సర్, పోలియో నిర్మూలన, ఇంటింటీ జ్వర సర్వే వంటి కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి రవీందర్, జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారిని సింధూజ, హెచ్ఈఓ శ్రీధర్, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్

కరుణించని వరుణుడు

- వర్షాలు లేక మొలకెత్తని పత్తి విత్తనాలు
- ఆందోళనలో అన్నదాతలు



పత్తి మొలకలకు పైపు ద్వారా నీరు పడుతున్న రైతు

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముందస్తుగా మురిపించిన వానలు ముఖం చాటేయడంతో వరుణుడి కరుణకోసం అన్నదాతలు ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది తొలకరి ముందే పలకరించడంతో సాగుకు అనుకూలిస్తుందని రైతులు ముందుగానే దుక్కులు దున్ని పంటల సాగుకు సిద్ధమయ్యారు. పలుచోట్ల మే మూడో వారం నుంచే పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు నాటారు. ఒకటి, రెండు మంచి వర్షాలు పడగానే మొలకలు వస్తాయని భావించారు. కానీ ఈనెల రెండు వారాలు దాటినా వర్షం జాడ లేకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకటి, రెండు రోజుల్లో వర్షం కురవకపోతే పత్తి విత్తనాలు భూమిలోనే మాడిపోతాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ఆకాశం మేఘావృతమైనా వర్షం మాత్రం కురవలేదు. రానున్న రెండు, మూడు రోజుల్లో మంచి వర్షం పడితేనే పత్తి విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది. లేకపోతే విత్తనాలు మళ్లీ నాటాల్సివస్తే ఆర్థిక భారం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

● పెరిగిన పెట్టుబడి

ఎకరం భూమిలో పత్తి సాగుకు ప్లవ్ దుక్కికి, గొర్రు తోలకానికి, రోటోవేటర్‌కు, విత్తనాలకు, కూలీలు తదితరాలకు ఇప్పటికే రైతులు రూ.9 వేలకు పైగా పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. ఒకవేళ వర్షాలు కురువక విత్తనాలు మొలకెత్తక పోతే పరిస్థితి ఏంటని వారు ఆందోళన చెందుతున్నారు. వరుణ దేవుడు కరుణించాలని రైతులు కోరుతున్నారు.

● విత్తనాలు మొలకెత్తలేదు

- అల్లె కొమురయ్య, రైతు కుమ్మరిపల్లి



రెండు, మూడు వారాల నుంచి వర్షాలు లేకపోవడంతో పత్తి గింజలు మొలకెత్తలేదు. మూడు ఎకరాలు సాగు చేసి పత్తి గింజలు పెట్టాను. వర్షాలు పడకపోతే విత్తనాలు మాడిపోతాయని ఆందోళనగా ఉంది.

● వరుణుడిపైనే భారం

- రాజేశం, రైతు



వర్షాలు పడకపోతే పత్తి గింజలు మొలకెత్తక, రెండోసారి నాటాలంటే ఆర్థికభారం తప్పదేమోనని ఆందోళనగా ఉంది. ముందుగా కురిసిన వర్షానికి పత్తి నాటినం. ఏంచేయాలో పాలుపోవడం లేదు.

మద్యం మత్తులో బైక్‌కు నిప్పంటించిన యువకుడు



దగ్ధమవుతున్న బైక్

మల్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి గురువారం తన ద్విచక్రవాహనాన్ని దహనం చేశాడు. జగిత్యాల మండలం టీఆర్‌నగర్‌కు చెందన కలీం అనే వ్యక్తి రాజారంలోని హనుమాన్ ఆలయం వద్ద తన పల్సర్ వాహనాన్ని స్టార్ట్ చేయడానికి ప్రయత్నించాడు. అది స్టార్ట్ కాకపోవడంతో మద్యం మత్తులో ఉన్న అతడు దానికి నిప్పటించాడు. దీంతో మంటలు చెలరేగగా స్థానికులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. వాహనం పూర్తిగా దగ్ధం అయినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నబోనాల శివారులో చిరుత సంచారం..

- పాదముద్రలను గుర్తించిన రైతులు



చిన్నబోనాల శివారులోని పొలంలో చిరుత అడుగులు

సిరిసిల్ల రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లఅర్బన్ పరిధిలోని చిన్నబోనాల గ్రామశివారులోని వ్యవసాయ పొలాల్లో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయంతో వణికిపోతున్నారు. చిన్నబోనాల గ్రామ శివారులోని సుద్దగండి ప్రాంతంలోని వ్యవసాయపొలాల్లో గురువారం తెల్లవారు జామున చిరుతపులి పాదముద్రలను రైతులు గుర్తించారు. ఈ విషయాన్ని రైతులు తాజా మాజీ కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ దృష్టికి తీసుకరావడంతో అక్కడివెళ్లి పరిశీలించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖ అధికారులు అక్కడివెళ్లి అడుగులను పరిశీలించి చిరుతపులి అడుగులుగా గుర్తించారు. రాత్రిపూట రైతులు వ్యవసాయ పొలాల వైపు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు కోరారు. ఎలాగైనా చిరుతను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

శంకరపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళఅదృశ్యంపై కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో కేసునమోదైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన బొంతల లావణ్య ఈ నెల10న ఇంటినుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. లావణ్య భర్త రాజు చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. దీంతో రాజు కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో లావణ్య అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు మిస్సింగ్ కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తడి ఆరని కన్నీటి ధార..

- ఐదు దశాబ్దాలుగా అంతర్గాం కాందిశీకుల ఆర్తనాదాలు
- ఏళ్లు గడిచినా పరిష్కారానికి నోచుకోని సమస్యలు

నేడు అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం

అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవాన్ని అంతర్గాం కాందిశీకులు జరుపుకోవ డానికి సిద్ధపడుతున్నారు. ఐదు దశాబ్దాలుగా పునరావాస సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు. మిల్లుల మూసివేతతో ఉపాధి కోల్పోయి నిరుద్యోగం, ఆకలి, అనారోగ్యాలతో బతుకు భారమై కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు ఇప్పటికైనా ఆదు కోవాలని వారు వేడుకుంటున్నారు. ఈ అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం నుండైనా అణగారిన అంతర్గాం కాందిశీలకుల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆశిద్దాం...

గోదావరిఖని, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాందీశీకులు కన్నీటి ధారలు ఆరడం లేదు.. వారిని కరుణించిన ప్రభుత్వాలే కన్నీట ముంచాయి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు శ్రీలంక, బర్మాకు (మయన్మార్) బతుకుదెరువు కోసం వలస వెళ్లారు. 1970 ప్రాంతంలో అక్కడ కరువు ఏర్పడడంతో భారత ప్రభుత్వం వారిని కాందీశీకులుగా తీసుకువచ్చి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉపాధి కల్పించింది. ఈ క్రమంలో పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు ఏర్పాటు చేసి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. వీవింగ్ మిల్లులో 509 మంది, స్పినింగ్ మిల్లులో 434 మంది కాందిశీకులు ఉద్యోగాలు చేశారు. అంతర్గాంలో కార్మికుల కోసం క్వార్టర్లు, ఇతర వసతులు కల్పించారు. 90వ దశకం వరకు అంతా సాఫీగా జరిగింది.



మూతపడిన స్పిన్నింగ్ మిల్లు



మూతపడిన వీవింగ్ మిల్లు

మిల్లుల మూసివేతతో కష్టాలు

యాజమాన్య లోపాలు, అవినీతి వల్ల స్పిన్నింగ్, వీవింగ్ మిల్లులు నష్టాల పాలయ్యాయి. 1989లో వీవింగ్ మిల్లును మూసివేశారు. దీంతో కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇందులో పని చేసిన 197 మంది కాందిశీకులు దుర్భర దరిద్ర్యాన్ని, వృద్ధాప్యాన్ని అనుభవిస్తున్నారు. 162 మంది కార్మికుల కుటుంబాలు వివిధ కారణాలతో మృతి చెందారు. స్పిన్నింగ్ మిల్లును 1991లో లే ఆఫ్ ప్రకటించి మూసివేశారు. ఇందులో పని చేసిన 434 మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

- లక్ష్మీ స్పిన్నింగ్ మిల్లులో 1970 నుంచి 1991 వరకు కార్మికురాలిగా పని చేసింది. అంతర్గాంలో అప్పుడు ఆమెకు క్వార్టర్ ఇచ్చారు. ఆ పునరావాస కాలనీలో ఉన్న క్వార్టర్ 1994లో కూలి పోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తమ బకాయిలు వస్తాయని ఎదురు చూస్తున్న లక్ష్మి ఆదేస్థలంలో ఓ రేకుల షెడ్డు వేసుకుని జీవిస్తున్నది.

ఈ రెండు మిల్లుల కార్మికుల వేతనాల బకాయిల కూడా చెల్లించలేదు. క్వార్టర్లు శిథిలమయ్యాయి. ఆ స్థలాలకు పట్టాలు ఇవ్వలేదు. దీంతో వారికి నిలువ నీడ కరువైంది.

ఇళ్లన్నా ఇవ్వండి..: రామారావు, బర్మ, శ్రీలంక కాందిశీకుల సంఘం ప్రధాన కార్యదర్శి



జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ ప్రభుత్వాలు బర్మ, శ్రీలంక కాందిశీకులకు అంతర్గాంలో పునరావాసం కల్పించాయి. 350 ఎకరాల్లో వెయ్యి ఇళ్ల కట్టి వెయ్యి మందికి ఉపాధి కల్పించింది. ఇప్పుడు అంతర్గాం మిల్లులకు సంబంధించి భూములన్నీ అన్యాక్రాంతవుతున్నాయి. అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. 50ఏళ్ల తరువాత కూడా కాందిశీకులం పునరావాసం కోసం వేడుకుంటున్నాం. ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం సాధ్యం అయినా, కాకపోయినా తలదాచుకునేందుకు ఇంటి స్థలాన్ని, ఇల్లును ఇప్పించాలని కోరుకుంటున్నాను.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు..

- ఒకరి మృతి



నరేశ్(ఫైల్)

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామశివారులో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. వేములవాడ మండలం చింతల్‌ఠాణ ఆర్‌అండ్‌ఆర్‌కాలనీకి చెందిన కుర్మ నరేశ్(36) ద్విచక్రవాహనంపై చిన్నలింగపూర్‌లో రైల్వేలైన్ పనులు చేయడానికి వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 వాహనంలో జిల్లా ప్రధానఆసుపత్రికి తరలించి చికిత్సచేస్తుండగా మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మమత, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

వీణవంక, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన ఆరెపల్లి అనూష(26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. అనూష కొంతకాలంగా అత్తగారింటికి వెళ్లకుండా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు అత్తగారింటికి వెళ్లాలని సూచించించారు. అత్తగారింటికి వెళ్ళడం ఇష్టంలేక అనూష 16వతేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. అనూష తండ్రి చిలువేరు నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడి



ముస్తాబాద్ ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ముస్తాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్సై గణేశ్, మండల వ్యవసాయాధికారి దుర్గరాజు, తంగళ్లపల్లి వ్యవసాయాధికారి సంజీవ్‌లు గురువారం తనిఖీచేశారు. మండల కేంద్రంలోని పలుదుకాణాల్లో లైసెన్సులు, స్టాక్ రిజిష్టర్లు, బిల్ బుక్కులు తనిఖీ చేశారు. డీలర్లు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అమ్మవద్దని హెచ్చరించారు. రశీదు లేకుండా ఏది అమ్మవద్దని, రైతులకు ఉపయోగపడే వాటినే విక్రయించాలని సూచించారు. అక్రమంగా నిలువ ఉంచిన విత్తనాలను అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గ్రామపంచాయతీ ఎదుట మహిళల బైఠాయింపు



ఓదెల గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మహిళలు

ఓదెల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గురువారం 10వ,వార్డు మహిళలు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మురికి కాలువల నిర్మాణం చేపట్టారని, ఇందులో మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టలేదని మహిళలు తెలిపారు. మురికి కాలువల్లో నల్లాల నీరు వృథాగా పోతుండడంతో కాలువలు నిండి నీటినిలువతో దుర్వాసన, దోమలు అధికమవుతున్నాయని తెలిపారు. నీటినిలువ ఉండకుండా మంచినీటి నల్లాల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తర లిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గురువారం ఖాజీపూ ర్‌లో పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మందుబాబుల ఆగడాలు

- పాఠశాల మైదానాలు, పల్లెప్రకృతి వనాల్లో అడ్డా
- ప్రమాదకరంగా పగిలిన గాజుముక్కలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు, ప్రజలు
- గస్తీ ఏర్పాటు చేయాలని వేడుకోలు



ఎల్ఎండీలోని శిశుమందిర్ పాఠశాల మైదానంలో తాగి పగలకొట్టిన మద్యం సీసాల ముక్కలు



ఎల్ఎండీలోని పాఠశాల మైదానంలో వెలుతురు కోసం వేసిన మంట, అందులో వేసిన ఖాళీ మద్యం సీసాలు

తిమ్మాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీకాలనీ మందుబాబులకు అడ్రస్‌గా మారింది. ఉదయం, సాయంత్రం తేడాలేకుండా మందుబాబులు మందు తాగేందుకు పాఠశాలలు, కూలిన ఎస్ఆర్ఎస్పీ క్వాటర్లు, పల్లె ప్రకృతివనాలను అడ్డాలుగా మార్చుకుంటున్నారు. రాత్రి అయిందంటే చాలు ద్విచక్రవాహనాలు, కార్లలో వచ్చి ఈస్థలాల్లో మద్యం తాగుతూ ఉంటారు. మద్యం బాటిళ్లను పగలగొట్టి వెళుతుండటంతో గాజుముక్కలు ప్రజలకు ప్రమాదంగా మారుతు న్నాయి. ఉదయం వాకర్స్, మైదానంలో ఆటలు ఆడేవారు ఈ మద్యం సీసా ముక్కలతో ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడ గుచ్చుకుంటాయోనని ఆందోళనచెందుతున్నారు. రాత్రి సమయంలో అటు వైపుగా విద్యుత్‌దీపాలు సరిగా లేకపోవడంతో చీకట్లో మందుబాబులు ఆడిందే ఆటగా మారిందని స్థానికులు అంటున్నారు. రాత్రి సమయాల్లో బయటకు వెళ్లేందుకు భయమేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పోలీసులు ఇటువైపు ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేసి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కందుల యశ్వంత్ కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామంలో ఏప్రిల్19న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా వెంటనే కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించి ఫోన్‌ను రికవరీ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి గురువారం ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. ఫోన్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకోవటంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.



బాధితుడికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

హత్య కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో గొడవపడి వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరికి ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రత్న పద్మావతి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మాజీ పేటకు చెందిన సావన్‌పెల్లి శేఖర్(28) అనే వ్యక్తి వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 2022 మార్చి 22న శేఖర్ తన మిత్రుడు నాగభూషణంతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతకగా గ్రామ శివారులో శేఖర్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేయగా జగిత్యాల రూరల్ సీఐ కృష్ణ కుమార్ దర్యాప్తు చేశారు. పోలీసుల దర్యాప్తులో శేఖర్ అనే వ్యక్తిని అతడి స్నేహితులు రస రాజేశం, బలిజ నాగభూషణంలు మద్యం మత్తులో గొడవ పడి పదునైన ఆయుధంతో పొడిచి హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలు రాజేశం, నాగభూషణంలకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ముద్దాయిలకి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడికి 6 నెలల జైలు

కరీంనగర్ క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని శ్రీ శివభక్తి ఆంజనేయ స్వామి దేవాలయంలో పంచలోహ విగ్రహం, గోముఖం, ఇతర వస్తువులు దొంగత నానికి పాల్పడిన కేసులో నిందితుడు గట్టుబూత్కూర్‌కు చెందిన ఎగుర్ల గట్టయ్యకు కరీంనగర్ ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ 6 నెలల జైలుశిక్ష, 400 రూపాయల జరిమానా విధించారని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. చోరీ కేసులో నిందితు డిని జనవరి 6న అరెస్టు చేయగా గురువారం తీర్పు వెలువడిందని తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి, కోర్టు కానిస్టేబుల్ మౌనికలను సీఐ అభినందించినట్లు తెలిపారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7400 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఐదుగురు రైతులు 76క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7400, కనిష్ఠ ధర రూ.7200 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఎనిమిదేళ్లుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూపులు

- బియ్యం కోసం ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబం

చిగురుమామిడి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చిగురుమామిడి మండలంలోని రామంచ గ్రామానికి చెందిన దర్శనం మౌనిక-సహదేవ్ దంపతులు ఎనిమిది సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. రోజుకూలి చేసుకునే వీరిది పేద కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పేదప్రజలకు ఇచ్చే రేషన్ కార్డులు అర్హులకు అందడం లేదనడానికి వీరు ప్రత్యక్ష ఉదాహరణ. రోజువారి ఆహారం కోసం దుకాణాల్లో డబ్బులుపెట్టి బియ్యం కొని తెచ్చుకుంటున్నారు. దీంతో కూలి డబ్బులుకాస్తా తినే తిండికే సరిపోతున్నాయని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. పనిదొరకని రోజు పిల్లలు వారు పస్తులుండాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి అర్హులైన వారిని గుర్తించి రేషన్‌కార్డులు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● కూలి డబ్బులు బియ్యానికే సరిపోతున్నాయి..

- దర్శనం మౌనిక-సహదేవ్..

మేము అనేక సంవత్సరాలుగా రేషన్‌కార్డు కోసం దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నాం. ఐనప్పటికీ మాకు రేషన్‌కార్డు రాలేదు. రోజు కూలి పనులు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో సగం డబ్బుతో బియ్యం తీసుకువచ్చి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చేతికి పని దొరకని రోజు పస్తులుండుడే. అధికారులు మాపై దయ చూపి రేషన్‌కార్డు ఇచ్చి ఆదుకోవాలి.



ఇంటి ఎదుట పిల్లలతో మౌనిక, సహదేవ్ దంపతులు

బావిలో పడి ఒకరి మృతి

ధర్మారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామా నికి చెందిన గొర్ల కాపరి పెద్ది మల్లయ్య(61) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం గొర్ల కాపలకు గ్రామ శివారులోకి వెళ్ళాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండగా బావి వద్ద ఉన్న చెట్టుకింద సేదదీరుతూ అందులో పడి మృతి చెందాడు. మిగితా కాపర్లు వచ్చి చూసే సరికి బావిలో చెప్పులు తేలి ఉండడం, కర్ర బావి వద్ద ఉండడంతో అందులో పడినట్లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మల్లయ్య భార్య పెద్ది పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

సుడా నిధులతో గ్రామాల అభివృద్ధి

- గుండ్లపల్లి స్టేజివద్ద వీధి దీపాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, సుడా చైర్మన్



స్ట్రీట్ లైట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

గన్నేరువరం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సుడా నిధులతో సుడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి స్టేజి నుండి గన్నేరువరానికి వెళ్లే ప్రధాన రహదారిలో రూ.20లక్షల సుడా నిధులతో ఏర్పాటు చేసిన వీధిదీపాలను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుడా పరిధిలోని గ్రామాలకు మహర్దశ పట్టనున్నదని అన్నారు. సుడా నిధులతో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సుడా పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు నిధుల మంజూరుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్ రెడ్డి, ముల్కల మల్లేశం, బేతెల్లి రాజేందర్‌రెడ్డి, వంగల సత్తిరెడ్డి, బొల్లి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్లాంటేషన్ సర్వేను అడ్డుకున్న రైతులు

- వెనుదిరిగిన అధికారులు



రోడ్డుపై బైఠాయించిన రైతులు

వీర్నపల్లి, జూన్ 19 (ఆంధ్ర జ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామంలో 30ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న అటవీభూముల్లో ప్లాంటేషన్ కోసం సర్వే చేయద్దని అటవీ శాఖ అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమ భూముల్లో సర్వే చేయద్దంటూ రైతులు రోడ్డుపై భీష్మించుకు కూర్చున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంత అటవీ భూమిసాగులో ఉందని తెలుసు కునేందుకే సర్వే చేస్తున్నామని అల్మాస్‌పూర్, గొల్లపల్లి సెక్షన్ అధికారులు పద్మలత, సక్కారాం రైతులకు వివరించారు.

అయినా రైతులు ఒప్పుకోకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. రైతులు వినిపించుకోకపోవడంతో అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులకు సమాచారాన్ని అందించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధి కారులు తెలిపారు. రాత్రిపూట భూములను సాగు చేయకుండా బేస్ క్యాంపు సిబ్బంది, వాచర్లు గస్తీ నిర్వహిస్తున్నారు.

వేములవాడలో ముగిసిన కూల్చివేతలు

● మిగిలిన శిథిలాల తొలగింపు



కూల్చివేతలో భాగంగా సగం తొలగించిన భవనం

వేములవాడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని ప్రధానరహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేత పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ముందు నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను తొలగించే ప్రక్రియను అధికార యంత్రాంగం ఆదివారం ప్రారంభించగా, బుధవారం రాత్రికి కూల్చివేతలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును 80అడుగుల మేరకు విస్తరించే క్రమంలో 243ఇళ్లను తొలగించాల్సి ఉండగా, ఇందులో 80ఇళ్లకు సంబంధించిన యజమానులు కోర్టును ఆశ్రయించి స్టేపొందడంతో వాటిని మినహాయించి మిగతా వాటిని అధికారులు కూల్చివేశారు. రోడ్ల వెడల్పుకోసం సేకరించాల్సిన స్థలంమేరకు మార్కింగ్ చేసి ప్రొక్లెయినర్లతో కూల్చివేశారు. మిగిలిపోయిన నిర్మాణం సైతం దెబ్బతినే అవకాశం ఉండడంతో కొందరు ఇంటియజమానులు నష్టపోయే భాగాన్ని కూల్చివేసేందుకు తమకే అవకాశం ఇవ్వాలని కోరడంతో అధికారులు అందుకు అంగీకరించారు. పాక్షికంగా కోల్పోతున్న ఇళ్లు, ఇతర నిర్మాణాలలో సంబంధిత యజమానులు కూలీల సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. ఇదిలాఉండగా ఇప్పటివరకు కూల్చివేత పూర్తయిన వాటికి సంబంధించిన శిథిలాలను తరలించాల్సి ఉండగా, అందుకు సంబంధిత నిర్మాణాల యజమానులకే అవకాశం ఇచ్చామని మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. ఇందుకోసం నాలుగు రోజులు సమయం ఇస్తున్నామని, అప్పటిలోగా శిథిలాలు తరలించాలని లేనిపక్షంలో తామే శిథిలాలను తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పుట్ట మధు

పెద్దపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పరికిపండ్ల నరహరి ఐఏఎస్ తండ్రి పరికిపండ్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆలయఫౌండేషన్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో ఉమ్మడి నాలుగు జిల్లాల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. గురువారం ప్రారంభమైన ఈపోటీలకు ముఖ్య అతిథులుగా మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, బీజేపీ నాయకురాలు కందుల సంధ్య రాణి, బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లాల నుంచి 32జట్లు పాల్గొంటున్నాయి. ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్ బాబు, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేంద్ర కుమార్, డిప్యూటీ సీఈవో కీర్తి నాగార్జున, ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము, లక్ష్మణ్, పుప్పాల దయానంద్, రామస్వామి, సోము శ్రీనివాస్, జాగిరి శ్రీకాంత్, కన్నం వెంకటేష్, కమలాకర్ రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్, పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

● ఎస్పీ అశోక్ కుమార్



వాహనానికి నంబరు ప్లేట్ బిగిస్తున్న పోలీసులు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా, కొత్త వాహనాలకు రిజిస్ట్రేషన్ చేయించకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ అశోక్ కుమార్ హెచ్చరించారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలమేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడుపుతున్న 306వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహన నంబర్లను ట్యాంపరింగ్‌చేస్తే వాహనాలను సీజ్‌చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలని ఎస్పీ కోరారు.



సిరిసిల్ల జిల్లాకు ఆర్చరీ అకాడమీ

నేడు ప్రారంభించనున్న రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్

సిరిసిల్ల టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో వాలీబాల్ అకాడమీకి అనుమతులు లభించాయి. గత సంవత్సరం నుంచే జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్ జిల్లా కేంద్రంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ చొరవతో ఎట్టకేలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుంచి ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు సానుకూలంగా స్పందన వచ్చింది. ఇటీవల సిరిసిల్ల మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు, విద్యార్థుల శిక్షణకు కావాల్సిన సౌకర్యాలను స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పరిశీలించారు. అనుకూల వాతావరణం ఉండడంతో ఆర్చరీ అకాడమీ ఏర్పాటుకు అనుమతులను మంజూరు చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆర్చరీ అకాడమీని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించనున్నారు. అకాడమీ ప్రారంభోత్సవం అనంతరం ఆర్చరీ అకాడమీలో చేరికలకు 14 నుంచి 16 ఏళ్లలోపున్న 20 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

కబడ్డీ అకాడమీ మంజూరు చేయాలి

మదన్, కబడ్డీ అసోసియేషన్ సహాయ కార్యదర్శి



గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కబడ్డీ క్రీడకు ప్రాధాన్యం ఉంది. కబడ్డీ క్రీడకు ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలి. జిల్లాలో వాలీ బాల్, ఆర్చరీ అకాడమీ రావడం ఆనందంగా ఉంది. జిల్లాలో కబడ్డీ అకాడమీని మంజూరు చేయాలి. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రత్యేక క్రీడా శిబిరాలతో శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం, అధికారులు కూడా ప్రోత్సాహం అందిస్తే జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణిస్తారు.

మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి..

సీహెచ్ శ్రీకుమార్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



రాజన్న సిరిసిల్ల జిల్లాకు మరిన్ని క్రీడా అకాడమీలు రావాలి. క్రీడలకు పుట్టినిల్లు అయిన రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా కేంద్రం వరకు ప్రతి క్రీడలో క్రీడాకారులు ప్రావీణ్యం సాధిస్తున్నారు. ప్రభుత్వం, జిల్లా అధికా రులు మరింత ప్రోత్సాహం ఇస్తే జాతీయ స్థాయిలో విజయాలను సాధిస్తారు. వాలీబాల్ అకాడమీతో పాటు ఆర్చరీ అకాడమీ ప్రారంభం కానుండడం ఆనందంగా ఉంది.

విలోచవరంలో పోచమ్మ బోనాలు

మంథనిరూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరంలో గురువారం పోచమ్మతల్లికి సామూహిక బోనాలను సమర్పించారు. వర్షాకాలం పంటల సాగు ముందు పిల్లా పాపలతో గ్రామంలోని పోచమ్మ తల్లికి బోనాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. గ్రామస్థులంతా డప్పుల చప్పుళ్లతో గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.



పోచమ్మతల్లి వద్దకు వెళ్తున్న గ్రామస్థులు

రాజన్న నిత్యాన్నదాన సత్రానికి విరాళం అందజేత



ఏఈవో శ్రావణ్‌ను కలిసి చెక్కులు అందజేసిన దాతలు

వేములవాడ కల్చరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి నిత్యాన్నదానానికి దాతలు విరాళాన్ని అందజేశారు. సుప్రీంకోర్టులో అడ్వకేట్‌గా చేస్తూ న్యూఢిల్లీలో నివాసం ఉంటున్న బోయినపల్లి మండలం వర్దవల్లి గ్రామానికి చెందిన పీచర శ్రీహర్ష, ఆయన స్నేహితుడు శ్రీకృష్ణకుమార్ కుటుంబసభ్యులతో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం రాజన్న నిత్యాన్నదాన సత్రానికి చెరో లక్ష రూపాయల చొప్పున ఏఈవో శ్రావణ్‌కుమార్‌కు అందజేశారు. వారివెంట కాంగ్రెస్ జిల్లా నాయకుడు చింతపల్లి శ్రీనివాస్‌రావు ఉన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై చర్యలేవి?

● జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో రూ.7కోట్లు దుర్వినియోగం
● ఏడాది అవుతున్నా ఎటూ తేలని వ్యవహారం
● తాజాగా సూపరింటెండెంట్ ఫిర్యాదుతో పోలీసుల ఆరా



విచారణ జరుపుతున్న అధికారులు(ఫైల్)

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో గత ఏడాది జరిగిన రూ.7కోట్ల నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో సొమ్ము రికవరీ కాలేదు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించగా ఉన్నతాధికారులు వైద్యవిధానపరిషత్ రికార్డు అసిస్టెంట్ యాసిన్‌ను సస్పెండ్ చేసి రెండున్నర కోట్లు రికవరీ చేసినా మిగతాసొమ్ము సంగతి అధికారులు పట్టించుకోలేదు. తాజాగా గతమేనెలలో టీవీవీపీ (తెలంగాణ వైద్యవిధానపరిషత్) జగిత్యాల సూపరింటెండెంట్ ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేయడంతో నిధుల గోల్‌మాల్ వ్యవహారం మళ్లీ ముందుకు వచ్చింది.

● అవినీతి బయట పడిందిలా..

కోరుట్ల టీవీవీపీ సూపరింటెండెంట్ గత సంవత్సరం ఒక చెల్లింపు విషయంలో వైద్య విధానపరిషత్‌కు చెందిన బ్యాంక్ ఓచర్‌పై 8వేల రూపాయలు రాసి ఇచ్చారు. రికార్డు అసిస్టెంట్ దానిని 28లక్షల రూపాయలుగా మార్చి ఇదే డిపార్ట్‌మెంట్‌కు చెందిన మరో వినియోగం లేని అకౌంట్‌లో వేయడంతో ఈ అక్రమాల వ్యవహారం బయటకు వచ్చింది. దీంతో ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ జరపడంతో వైద్యవిధాన పరిషత్‌కు చెందిన యాసిన్ అనేఉద్యోగి ఈ అకౌంట్‌ను వాడుతున్నట్లు గుర్తించారు. వెంటనే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని నియ మించారు. అయితే ఈ విచారణలో ఉద్యోగుల ఖాతాలో జమ చేయా ల్సిన డీఏ, ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, మరియు రెగ్యులర్ ఏరి యర్స్‌తోపాటు వివిధ ఖాతాల్లో వేయాల్సిన ఏడుకోట్ల సొమ్ము పక్క దారి పట్టినట్లు విచారణ కమిటీ సభ్యులు గుర్తించారు. అయితే వినియోగంలో లేనిఖాతాకు సొమ్ము మళ్లించిన యాసిన్ తనదగ్గరి వ్యక్తుల ఫోన్ నంబర్‌ను ఖాతాకు లింక్ చేసి దానిపై యూపీఏ అకౌంట్‌క్రియేట్ చేసి డబ్బులు డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు.

● 2020 నుంచి ఆడిట్ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..

జగిత్యాల జిల్లా వైద్యవిధాన పరిషత్‌లో రికార్డు అసిస్టెంట్ యాసిన్ 2020నుంచి లావాదేవీలు పర్యవేక్షిస్తుండగా ఆడిట్ అధికారులు 2022నుంచి ఆడిట్ చేశారు. మరో రెండు సంవత్సరాల ఆడి ట్ నిర్వహించి మరింత లోతుగా విచారణ జరిపితే మరింత అవినీతి బయట పడే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు. నిధుల గోల్‌మాల్‌పై గతంలో విచారణ జరిపిన కమిటీ సభ్యులకు బ్యాంక్‌అధికారులు సహకరించక పోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. వినియోగంలో లేని ఖాతాను తిరిగి తెరిచేందుకు జిల్లా అధికారుల సంతకం ఫోర్జరీ చేశారా అనే కోణంలో విచారణ జరిపితే అన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

● ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు

- రామకృష్ణ, సూపరింటెండెంట్ టీవీవీపీ, జగిత్యాల

జగిత్యాల అర్బన్, జగిత్యాల జిల్లా తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లో గతసంవత్సరం జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాల్సిందిగా జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. పోలీసుల విచారణ అనంతరం అక్రమాలకు పాల్పడిన వారిపై ప్రభుత్వ ఆదేశాలకు మేరకు చర్యలు చేపడతాం.

మాజీ ఎంపీటీసీ కుంటయ్య ఆరోపణల్లో నిజం లేదు..

● రూరల్ సీఐ మొగిలి



మాట్లడుతున్న రూరల్ సీఐ మొగిలయ్య

తంగళ్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాజీఎంపీటీసీ కుంటయ్య చేసిన ఫిర్యాదును పట్టించుకోలేదని పోలీసులపై అసత్యప్రచారం, తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని రూరల్ సీఐ మొగిలి అన్నారు. బుధవారం సీఐ విలేకరుల సమావేశంలో మాట్లడుతూ తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య 2023జూలై 25వ తేదిన లేని భూమిని తనకు మల్యాల నాగరాజు రిజిస్ట్రేషన్ చేశాడని ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై స్పందించి మల్యాల నాగరాజుపై చీటింగ్ కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలు సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. అలాగే తంగళ్లపల్లికి చెందిన గంగ కిష్టరెడ్డి 2024 డిసెంబర్ 12వతేదిన కర్కబోయిన కుంటయ్య భూమి విషయంలో మోసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. కుంటయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో పోలీసులపై తప్పుడు ఆరోపణలు, వదంతులు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పోలీసులు న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. పోలీసులు భూమి సంబంధించిన అంశాలు, సివిల్ వివాదాల్లో ఎటువంటి జోక్యం చేసుకోలేదని, చట్టపరిధిలో విచారించారని తెలిపారు. భూమిఅంశాలు, సివిల్‌వివాదాలను న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని తెలిపారు.

రేపు జాబ్ మేళా

గణేశ్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు కరీంనగర్‌లోని రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ కరీంనగర్‌లో ఉద్యోగాలు కల్పించడానికి 21న శనివారం తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, గెస్ట్ హౌస్ ఎదురుగా, సవరన్ వీధి కరీంనగర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి వై.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో 2 లైఫ్ ప్లానింగ్ అధికారి, అప్రెంటీస్, ఎల్‌పిఓ 20 పోస్టులు ఖాళీలు ఉన్నాయని, వీటికి మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఏదైనా డిగ్రీ ఆపై చదివి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వారి వయస్సు 20 సంవత్సరాలు, నెలసరి వేతనం 20 వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు జూన్ 21న ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఆర్‌అండ్ బి గెస్ట్‌హౌస్ ఎదురుగా, తనిష్క్ జ్యువెలర్స్ 4వ అంతస్తు, కరీంనగర్ కు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం. 9848168440, 6281363909 నందు సంప్రదించాలని తెలిపారు.

గుడుంబా పట్టివేత

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని జగదేవపేట గ్రామా నికి చెందిన దారంగుల మల్లేష్ గుడుంబా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎవరైనా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విభాషా పుస్తకాలు



● తెలుగు, ఇంగ్లీషులో ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు
● విద్యార్థులకు ఉపయోగకరం

కరీంనగర్ టౌన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగేళ్ల క్రితం నుంచే ఇంగ్లీష్ మీడియం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకు తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో చదవడం కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠాలను అర్థం చేసుకోలేక పోతున్నారని విద్యాశాఖ అధికారులు గుర్తించారు. దీన్ని అధిగమించడానికి పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఒక పక్క ఇంగ్లీష్, మరో పక్క తెలుగులో ముద్రించి ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది 1 నుంచి 10వ తరగతి వరకు గణితం, ఫిజిక్స్, బయాలజీ, సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాలను ఇంగ్లీష్, తెలుగు భాషల్లో అచ్చు వేసి పంపిణీ చేసింది.

పేజీలు ఎక్కువ ఉండడంతో రెండు భాగాలుగా..

ఈ యేడాది కూడా గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకాల్లోని మొత్తం చాప్టర్లను ఒక పేజీ ఇంగ్లీష్, దాని పక్కనే మరో పేజీలో తెలుగు బాషల్లో ముద్రించారు. పేజీలు పెరగడంతో వీటి పరిమాణం, బరువు ఎక్కువ అవుతుండడంతో విద్యార్థుల సౌలభ్యం కోసం రెండు భాగాలుగా విభజించారు. మొదటి బాగం జూన్ నుంచి అక్టోబరు వరకు ఎస్ఏ-1 పరీక్షల కోసం పార్ట్-1గా, రెండో భాగం నవంబరు నుంచి మార్చి వరకు ఎస్ఏ-2 పరీక్షల కోసం (పార్ట్-2)గా విభజించారు.

ఆకర్షణీయంగా..

పాఠశాలలు పునఃప్రారంభమైన 12వ తేదీ నుంచే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. పుస్తకాల కవర్ పేజీ ముద్రణలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈ పుస్తకాల్లో పాఠ్యాంశాలకు అనుగుణంగా రంగురంగుల బొమ్మలు చూడగానే పాఠం సారాంశం అర్థమయ్యేలా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. దీనికి తోడు పాఠ్యపుస్తకాల్లో ప్రతీ పాఠానికి ఒక క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీనిని మొబైల్ ద్వారా స్కాన్ చేసి ఆపాఠానికి సంబంధించిన వీడియోలను వీక్షించవచ్చు. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో సులువుగా చదివి రాణిస్తారని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులు అవగాహన పెంచుకోవచ్చు

చకినాల రామ్మోహన్, ఎస్ఏ గణితం, తిమ్మాపూర్ మండలం



పాఠ్యపుస్తకాలను రెండు భాషల్లో ముద్రించడం విద్యార్థులకు ఉపయోగకరంగా ఉన్నాయి. ఇంగ్లీష్ మీడియంలో వెనకబడిన విద్యార్థులు తెలుగులో చదివి అవగాహన పెంచుకోవచ్చు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వనిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ యువజనసంఘం జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ డిమాండ్‌చేశారు. గురువారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. చాలావిద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆటస్థలం లేదని, పార్కింగ్ లేదని అన్నారు. విద్యాహక్కుచట్టాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు ఎస్సీ ఎస్టీవర్గాల పిల్లలకు ఉచితంగా కేటాయించాలని, స్టేషనరీ కూడాఉచితంగా అందచేయాలని చట్టం చెబుతుందన్నారు. ఈ చట్టాన్ని అమలు చేయని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీబీఎస్ఈ చట్టం ప్రకారం ప్రతిపాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ అసోసియేషన్‌లో ఇద్దరు తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. అసోసియేషన్ సూచనమేరకే ఫీజులు పెంచాలని తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు తగినచర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షచేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి మీసాలసాయిలు, జిల్లాప్రధానకార్యదర్శులు షైననిమనోహర్, మానాలనారాయణ, చామనపల్లిచంద్రశేఖర్,ఉపాధ్యక్షులు గండిగణేష్, తాటిపల్లి జంపన్న తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను పరిశుభ్రంగా ఉంచాలి

● జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ



కొత్తపల్లి ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

భగత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. కొత్తపల్లి ప్రాథమికఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. అవుట్ పేషంట్ రిజిస్టర్‌లు, ఇతర రికార్డులను పరిశీలించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల రిజిస్టరైన రెడ్ పుస్తకం, బ్లూ పుస్తకాలను పరిశీలించారు. అందులో రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఫార్మసి స్టోర్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్‌ను, ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందులను పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించు కోవడంవల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ ప్రసవాలు ఆరోగ్యకేంద్రాల్లో జరిగేట్లు గర్భవతులను వారి కుటుంబసభ్యులను ప్రోత్సహించాలన్నారు.

● ఫీల్డ్ ట్రైనింగ్..

బీఐఎంఎస్ డాక్టర్లకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆరోగ్యకార్యకలాపాలపై ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీవోఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా, కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నజియా, డీపీవో ఎన్‌హెచ్‌ఎం స్వామి, సాగర్, బీఐఎంఎస్ డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి పరామర్శ

గొల్లపల్లి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్గుమట్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సురిగినేని కమలాకర్‌రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గోస్కుల జలేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, మాజీ ప్రజా ప్రతినిధులు నక్క శంకరయ్య, ఆవుల సత్తయ్య, ఎల్లాల నారాయణ రెడ్డి, చెందోళి సింగిల్‌విండో చైర్మన్ గందె వెంకటమాధవ రావు, నాయకులు సురభి లక్ష్మణ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నాటు కోళ్లు మృతి

జగిత్యాల రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేటలో గోడుగు సురేష్‌కు చెందిన నాటు కోళ్లఫారంపై గురువారం కుక్కలు దాడి చేయగా 31 నాటు కోళ్లు మృతి చెందాయి. ఈసందర్భంగా కోళ్ల ఫారం యజమాని సురేష్ మాట్లాడుతూ 20 వేల రూపాయల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

కథలాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణ రావుపేటకు చెందిన ఆర్మీ జవాన్ బెజ్జంకి అభినవ్‌రావును గురువారం కళాధార పాఠశాల యాజమాన్యం సన్మానించింది. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా యుద్ధ భూమిలో పాల్గొని స్వస్థలంకు వచ్చిన సందర్భంగా యాజమాన్యం సన్మానం చేశారు. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు కరీంనగర్‌లో ఆర్మీ జవాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గడ్డం భూమారెడ్డి, మాజీ ఎంపీటీసీ మామిడిపల్లి రవి, మాజీ సర్పంచ్ గడీల గంగప్రసాద్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సారంగాపూర్, జూన్, 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య దొరుకుతుందని సారంగాపూర్ విద్యాధికారి బి. కిషోర్ అన్నారు. గురువారం మండలంలోని బట్టపెల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపపాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. విద్యార్థులు సర్కారు బడుల్లో చదివితే భవిష్యత్తుల్లో పలు రకాల ప్రయోజనాలు కలుగుతాయని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, గ్రామస్థులు కోల నర్సింహ రెడ్డి, అర్రై ప్రేమనందం, తిరిపెల్లి రాజయ్య, బత్తెపు అశోక్, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీపై ఎన్ఎంసీ అసంతృప్తి

(5వ పేజీ తరువాయి)

భాగంగా రూ.115 కోట్ల నిధులతో మెడికల్ కళాశాల భవన నిర్మాణం, బాలుర, బాలికల వసతిగృహాలు నిర్మించాల్సి ఉంది. ప్రభుత్వం మారడం, నిధుల కేటాయింపులు లేకపోవడంతో పనులపై తీవ్ర ప్రభావం చూపింది. కళాశాల ప్రధాన భవనాల పనులు తుది దశకు చేరాయి.

కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక నిలిచిన పనులు

మెడికల్ కళాశాలకు సంబంధించి ఇప్పటివరకు రూ.60 కోట్లకు సంబంధించిన పనులు పూర్తి చేశారు. అందులో రూ.49.80 కోట్ల పనులు బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్ ఆరు నెలలుగా పనులు నిలిపివేశాడు. ప్రస్తుతం మెడికల్ కళాశాల భవనానికి సంబంధించిన స్లాబ్‌లు, బ్రిక్స్ వర్క్స్ పూర్తయ్యాయి. బాలుర, బాలికల వసతి గృహాలకు సంబంధించిన స్లాబ్ నిర్మాణాలు జరిగినప్పటికీ బ్రిక్స్ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రెండో దశ పనులు పూర్తయితే మూడో దశలో మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణం, ల్యాబ్స్ నిర్మాణం, ప్రిన్సిపాల్, ఆయా డిపార్ట్‌మెంట్ హెడ్స్‌కు క్వార్టర్స్ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను సుమారు రూ. 60 కోట్లతో జరపాలన్న అంచనా ఉంది. అయితే రెండో దశలో పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. 18 నెలల్లో పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా విధించారు. ఆ దిశగా పనులు కొనసాగక పోవడంతో 2024 డిసెంబరు 31వ తేదీ వరకు గడువును పొడిగించారు. నిధుల కొరతతో గత యేడాది డిసెంబరు నెలాఖరు వరకు పనులు పూర్తి కాలేదు. దీంతో మూడోసారి పనుల గడువును పొడిగించాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో భవనాలు అందుబాటులోకి రాలేదు. ఈ ఆలస్యం ఎన్ఎంసీ అసంతృప్తికి కారణమైంది.



స్లాబ్ లెవల్‌లోనే నిలిచిన వైద్య విద్యార్థుల వసతిగృహ నిర్మాణం

● వసతుల లేమి..

ప్రస్తుత కాలేజీలో అధ్యాపకులు, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు, సీసీ టీవీ వంటి సౌకర్యాలు ఉన్నప్పటికీ, ఎంబీబీఎస్ విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణకు తగిన రోగుల మృతదేహాలు, వివిధ విభాగాలకు చెందిన వైద్య సౌకర్యాలు లేవు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు, ఆర్థోసేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అన్ని రకాల వ్యాధులపై ప్రాక్టికల్ అవగాహన కోసం అవసరమైన సౌకర్యాలు లేకపోవడం విద్యార్థుల విద్యను ప్రభావితం చేస్తోంది. బాలుర వసతి గృహాన్ని కృష్ణానగర్‌లో గల ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. బాలికల వసతిగృహాన్ని నర్సింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నారు.

● మరో ఆరు నెలలు..

వచ్చే ఏడాది కల్లా కొత్త భవనం, 500 పడకలతో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పూర్తయితే ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా కాలేజీ నిర్వహణ సాధ్యమవుతుంది. నూతన భవనం అందుబాటులోకి రావడానికి మరో ఆరు నెలలకు పైగా సమయం పట్టనుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుపై ఎన్ఎంసీ అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం ఉంది. అధికారులు సీట్ల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నప్పటికీ వసతుల ఏర్పాటుకు సవాళ్లు తప్పేలాలేవు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని మెడికల్ కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్ఎంసీ నోటీసులకు సమాధానం ఇచ్చాం
-సైఫ్ ఖాద్రీ, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఇటీవల రాష్ట్రంలోని దాదాపు అన్ని కొత్త వైద్య కళాశాలలకు ఎన్ఎంసీ నోటీసులు వచ్చాయి. నోటీసులకు సరియైన సమాధానం ఇచ్చాం. కళాశాలలో పూర్తి స్థాయి ఫ్యాకల్టీ లేని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్న వనరులతో కళాశాలను ఉన్నతస్థానంలో నిలబెట్టడానికి ప్రయత్నిస్తున్నాం.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభ ఫ్లోర్ లీడర్ రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, గొలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, వీరబత్తిని శ్రీనివాస్, చెట్‌పెల్లి సుధాకర్, దూమాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

● మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, జువ్వాడి భవన్‌తో పట్టణంలోని పలు వార్డులలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం,మండల అధ్యక్షులు అంజిరెడ్డి పాల్గొన్నారు.

● కోరుట్ల: పట్టణంలోని జువ్వాడి భవనంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు.

● ధర్మపురి: ధర్మపురిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాజేష్ పాల్గొన్నారు.

● రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో యువజన సంఘం ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, గంగాధర్, నరేష్ పాల్గొన్నారు.

● గొల్లపల్లి: వ్యవసాయ మార్కెట్ యార్డులో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

● కథలాపూర్: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ ఉన్నారు.

● కొడిమ్యాల: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణగౌడ్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు. నాచుపల్లిలో యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్‌గౌడ్ విద్యార్థులకు నోట్ బుక్కులను, పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లను అందించారు.

● మల్యాల: మల్యాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వెల్మ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

● పెగడపల్లి : మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు, మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన బొడ్డెల్లి అంజనేయులు కూతురు కృతిక తలసేమియాతో బాధపడుతోంది. పరిస్థితిని తెలుసుకున్న చిన్న నాటి మిత్రులు, 1996-1997 పదవ తరగతి బ్యాచ్ క్లాస్ మేట్లు కలిసి 80వేల రూపాయలను పోగు చేసి గురువారం అందించారు.

చెత్తను సేకరించాలని వినతి

రాయికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో చెత్త సేకరణ లేక పలు వార్డులలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చెత్త సేకరణ చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని రాయికల్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే రానున్న వేసవి కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా అయిల్ బాల్స్ సిద్ధం చేసుకోవాలని, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఆరు ఆటోలు, రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేసి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రాయికల్ పట్టణం అవార్డులు కూడా పొందిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పట్టణాలు, పల్లెలు పూర్తి అపరిశుభ్రతకు గురవుతున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎలిగేటి అనిల్ కుమార్, కార్యదర్శి మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య
-విప్ ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జూన్ 19 : ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గురువారం మేడిపల్లిలో ఇటీవల మంజూరైన ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. అనంతరం పోకుమల్ల గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మడలేశ్వర స్వామి వారి బోనాల జాతరలో పాల్గొన్నారు.

● ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పలువురు కార్పస్ ఫండ్‌ను అందజేశారు. ఎమ్మెల్యే లక్ష, మాజీ సర్పంచ్ బొంగోని రాజాగౌడ్ లక్ష 1116 వేలు, నాగరాజు లక్ష, తేలునరేష్ లక్ష, నరేష్‌రెడ్డి యాభైవేలు అందజేశారు. రాజాగౌడ్ కళాశాల విద్యార్థులకు నోట్‌బుక్స్ ఉచితంగా అందిస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని ఎమ్మెల్యేతో సారేతో వచ్చి మొదటి బహుమతిగా రూ.50,116, రెండవ బహుమతిగా 30,116, మూడో బహుమతిగా 20116 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, బొంగోని రాజాగౌడ్, నాగరాజు, నర్సరెడ్డి, ఇబ్రాయిల్, జలందర్, బలగం రాజేష్, శంకర్, లాజర్, దామెదర్, జలందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి
-జిల్లా విద్యాధికారి రాము



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాము

బీర్‌పూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం బీర్‌పూర్ మండలంలో పర్యటించిన ఆయన తుంగూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కొల్వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా తరగతి గదులు తిరిగి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనం చేస్తుండగా వారి వద్దకు జిల్లా విద్యాధికారి వెళ్లి భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించే చూడాలని అన్నారు. డిజిటల్ అవేర్‌నెస్ డేలో భాగంగా ఐఎఫ్‌పీ ప్యానల్స్ వినియోగించాలని సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో స్పోర్ట్స్ డే నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగభూషణం, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సత్యరాజ్, ఉపాధ్యాయులు ఒడ్నాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'చదువుతో పాటు ఆటల్లో రాణించాలి'

సారంగాపూర్, జూన్, 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. కోనాపూర్ జడ్పీహెచ్ఎస్ కోనాపూర్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్మించిన బాస్కెట్ బాల్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా క్రీడలు ఆడటం ద్వారా శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. దీంతో విద్యార్థులు చదువుల్లో రాణిస్తారని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని ఆయన అన్నారు. విద్యార్థులు ముఖ్యంగా ఫోన్‌లకు, టీవీలకు పరిమిత కావడంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో ఉన్న క్రీడ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి బి.కిషోర్, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, జిల్లా కోఆర్డినేటర్ రాజేష్, ఉపాధ్యాయులు వేణు, జిల్లా పెట అధ్యక్షులు విశ్వ ప్రసాద్, కృష్ణ ప్రసాద్, అజయ్ బాబు, రమా దేవి, శంకరయ్య, రవి, లక్ష్మీనారాయణ, వసంత, సుభాష్, భాష్కర్, రిమ్లాహసన్, విష్ణు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నియంత్రణకు చర్యలు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాయికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణకు టీబీ ఛాంపియన్లు కృషి చేయాలని జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. రాయికల్ మేరు సంఘ భవనంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో క్షయ వ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్ కుమార్, హెచ్ఈవో సాగర్ రావు, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఉమారాణి, స్టేట్ లీడ్ పురుషోత్తం, డిస్ట్రిక్ట్ లీడ్ రవి, అనిల్, మెట్‌పల్లి టీబీ ఎస్‌టీఎస్ అంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

● రాయికల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రక్తహీనత నివారణకు అందరూ కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కస్తూరి సతీష్ కుమార్, హెచ్ఈవో సాగర్ రావు, సూపర్‌వైజర్లు ఇల్లెందుల శ్రీనివాస్, ఉమారాణి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, జుబేదా ఫాతిమా, ప్రశాంత కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన మంత్రి అడ్లూరి

ధర్మపురి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అధికార నివాసంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు.. రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కల్పించిన నేపథ్యంలో వారిద్దరిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

కొడిమ్యాల, జూన్19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని విద్యుత్ శాఖ అధికారుల నెంబర్లు మారాయి. ఆర్.రఘునాథ్ ఏఈ (కొడిమ్యాల)-87124 86243, ఎన్. నగేష్ ఏఈ (పూడూర్)-87124 86308, కె. కరుణ సబ్ ఇంజనీర్ (పూడూర్) 87124 86257. జి. శ్రీనివాస్ లైన్ ఇన్స్‌పెక్టర్ (కొడిమ్యాల) 87124 86239, బి. శంకర్ లైన్ ఇన్స్‌పెక్టర్ (పూడూర్) 87124 86254, ఎస్. శంకర్ లైన్‌మెన్ (కొడిమ్యాల) 87124 86240, బి.వెంకటేశ్వర్లు లైన్‌మెన్ (తిర్మాలాపూర్) 87124 86241, కె. సతీష్ లైన్‌మెన్ (పూడూర్) 87124 86255, ఆర్.అయిలయ్య లైన్‌మెన్ (నాచుపల్లి) 87124 86252. మారినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ 87124 86238, మండలంలోని తిర్మాలాపూర్ సబ్‌స్టేషన్ 87124 86242, పూడూర్ సబ్‌స్టేషన్ 87124 86256, నమిలికొండ సబ్‌స్టేషన్ 87124 86253 నంబర్లుగా మారాయని తెలిపారు.

వైభవంగా బోనాల జాతర



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్



రాయికల్‌లో బోనాలతో ఊరేగింపు

జగిత్యాల క్రైం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం అంబారిపేట శివారులో ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

● జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి గ్రామంలో గురువారం ముదిరాజు కులస్తులు పెద్దమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ మంత్రి వెంట రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జున్ను రాజేందర్, మాజీ సర్పంచు చంద రాధకిషన్, శీలం సురేందర్, అయిల్నేని గంగాధర్, నవీన్‌గౌడ్, రజినీకాంత్ తదితరులు ఉన్నారు.

● రాయికల్: రాయికల్ పట్టణంలోని కుమ్మర శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్తపెల్లి గంగారాం, ప్రధాన కార్యదర్శి గంగాధరి సురేష్, కోశాధికారి కొత్తపల్లి గంగాధర్, సంయుక్త కార్యదర్శి తుంపేట రాజు, సంఘం సభ్యులు గంగాధరి రాజేశం, గంగాధరి నందు, కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● రాయికల్ పట్టణంలో గురువారం ఒడ్డెరాజు కులస్థుల ఆధ్వర్యంలో పెద్ద పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతరాజుల వీరంగాలతో, డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

● కథలాపూర్: మండలంలోని ఊట్‌పల్లిలో గురువారం దుర్గమ్మ, కట్ట మైసమ్మకు స్థానిక మహిళలు బోనాలు సమర్పించుకున్నారు. గ్రామ శివారులో ఉన్న అమ్మవారి సన్నిధికి వెళ్ళి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్ళతో బోనాలతో ఊరేగింపుగా వెళ్ళి నైవేద్యం సమర్పించుకున్నారు. ప్రజలు సుఖ, శాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

● గొల్లపల్లి: మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపావాస దీక్షలతో మహిళలు ప్రత్యేకంగా వండిన బోనాలను నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుళ్ల నడుమ గ్రామ దేవతల ఆలయాల వద్దకు ఊరేగింపుగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఊర పోచమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ తల్లి వంటి గ్రామ దేవతల ఆయాల్లో బోనాలతో ప్రదక్షిణలు నిర్వహించి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు పుష్కలంగా కురవాలని, పంటలు సంవృద్ధిగా పండాలని, పిల్లాజెల్లాను సల్లంగా చూడుంమ్రి పోచమ్మ తల్లులు అంటూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బాలే లక్ష్మయ్య, కుల పెద్దలు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

ధర్మపురి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని న్యూ హరిజనవాడ ఎంపీపీఎస్ విద్యార్థులకు రంగ హరినాథ్ మిత్ర బృందం రూ.10,000 విలువ గల నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, ఎరేజర్స్, పలుకలు గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా రంగ హరినాథ్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పేద పిల్లల సౌకర్యార్థం నోట్ బుక్స్ ఇతర వస్తువుల కోసం ఉపాధ్యాయ బృందం తనను సంప్రదించినట్లు తెలిపారు. వెంటనే హైదరాబాద్ బిల్డర్ ముత్యాల వెంకటేష్ సహృదయంతో ముందుకు వచ్చి పిల్లలకు ఉపయోగపడే సామాగ్రి అందించినట్లు ఆయన వివరించారు.

దాత వెంకటేష్‌కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగ హరినాథ్, రంగు లక్ష్మీనరహరి, కొండ వినయ్ కుమార్, పప్పుల శ్రీనివాస్, డాక్టర్ రవి, గుండ రాజేశ్వర్, స్తంభంకాడి జగదీష్, హెచ్ఎం కనకతార, టీచర్లు సరిత, హరీష్, అంగన్‌వాడి కార్యకర్త మాధవి పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలు పట్టివేత

మెట్‌పల్లిటౌన్,జూన్ 19(ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ముందర, పాత బస్టాండ్, డిపో సర్కిల్ ప్రాంతంలో పోలీస్‌లు వాహనాలను తనికీ చేశారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి సిఐ అనిల్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి, మల్లాపూర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది వాహనాలను తనికీ చేశారు. నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న 116 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ తనికీలలో ఎస్ఐలు రాజు, రాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

● ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని కమలాపూర్ చౌరస్తా వద్ద నెంబర్ ప్లేట్ లేని 11 ద్విచక్ర వాహనాలను ఎస్ఐ ఉదయ్‌కుమార్ గురువారం పట్టుకున్నారు. కమలాపూర్ చౌరస్తా వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అతి వేగంగా నెంబర్ ప్లేట్ లేని 11 వాహనాలను నడుపుతున్న వ్యక్తులను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం జరిమానా విధించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

● గొల్లపల్లి : రిజిస్ట్రేషన్ నంబర్ లేకుండా, నంబర్ ప్లేట్ దాచిన, వాహనం పై కొన్ని నంబర్లను తొలగించిన ఇక పై సంబంధిత వాహనదారుడి పై కేసు నమోదు చేస్తామని ఎస్సై చిర్ర సతీస్ కుమార్ హెచ్చరించారు. గురువారం గొల్లపల్లి మండల కేంద్రంలోని జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారి పై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని పలు వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం వాటికి నెంబర్ ప్లేట్లను అమర్చి విడిచిపెట్టారు.

● వెల్గటూర్: వెల్గటూర్ మండలంలో వాహనాల తనిఖీ చేసి నంబర్ ప్లేట్ లేని వాహనాలకు చలానా విధించినట్లు ఇన్‌చార్జి ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

వెల్గటూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలం లోని స్తంభంపల్లి. పైడిపల్లి గ్రామాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద వారి సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, సీహెచ్‌వో జగన్నాథం, హౌసింగ్ ఏఈ గౌతమి, పంచాయితీ కార్యదర్శులు, నాయకులు పూదరి రమేష్, శ్రీధర్, దుబ్బ స్వామి, గంగయ్య, నరేష్, హరీష్, శ్రీనివాస్, సంతోష్, రాజమౌళి, ఉమేష్, సుధాకర్, సురేష్, వేణు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మల్యాల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణీలకు హిమోగ్లోబిన్, బీపీ, షుగర్, యూరిన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణీలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంను ప్రోగ్రాం అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. గర్భిణులకు వారంలో రెండు సార్లు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతందని, వైద్య సేవలు పొందాలని వైద్యాధికారి మౌనిఖ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో రమేశ్, పీహెచ్ఎన్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ రమణమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతి గ్రామ సభలు

కొడిమ్యాల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్ గ్రామంలో గురువారం భూ భారతి గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. గ్రామ సభలో ప్రజల నుండి 15దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామ సభలో ఆర్ఐ కరుణాకర్ పాల్గొన్నారు.

● పెగడపల్లి : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం పక్షం రోజులుగా గ్రామాలలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులలో పెగడపల్లి మండలంలో 1556 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బి.రవీందర్ తెలిపారు.